సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం | 28 | ఆగస్టు | 2023



సీసీలకూ వాటా?

పెద్దతిప్పసముద్రం మండలంలో పని చేస్తున్న సంఘమిత్రలు.. గ్రూపు సభ్యుల నుంచి చేతి వాటం ప్రదర్శించిన సొమ్ము నుంచి సీసీలకూ వాటాలిచ్చారు. -8లో



చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

చోరీ కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 369 గ్రాముల బంగారు, ఒక ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.360
రెండోరకం	రూ.200	రూ.290

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 237 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	505	578
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 160.180 కిలోలు

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

30న తిరువన్నామలైకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 30న తిరువన్నామలైకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సి నిరంజన్ తెలిపారు. 30న డిపో నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రానుపోను చార్జి రూ.805 చెల్లించాలన్నారు. టికెట్లు బుకింగ్ కోసం డిపో రిజర్వేషన్ కౌంటర్ లేదా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీరెడ్డెమ్మతల్లికి బంగారు, వెండివస్తువుల వితరణ



శ్రీరెడ్డెమ్మతల్లికి బంగారు నెక్లెస్‌ను బహూకరిస్తున్న మంగపేట భక్తులు

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయానికి భక్తులు బంగారు నెక్లెస్, 3కేజీల వెండివస్తువులు విరాళంగా ఇచ్చారు. జిల్లాలోని ఓబుళంవారిపల్లె మండలం మంగంపేట గ్రామానికి చెందిన వెంకటకిషోర్‌రెడ్డి, దేవిక, వెంకటసుబ్బారెడ్డి, మాలతి దంపతులు రూ.1,62,000 విలువచేసే బంగారు నెక్లెస్‌ను అమ్మవారికి బహుకరించారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణానికి చెందిన రెడ్డిభానీష్విషిక, ప్రియాంక, కిరణ్ దంపతులు 3కేజీల బరువు గల పంచహారతులు,హారతిపళ్లెం, దక్షిణావృతశంఖం ,తీర్థంపాత్ర ఉద్దరిణి అందజేశారు. ఆదివారం ఆలయానికి చేరుకున్న వీరికి ఈవోమంజుల ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు, ప్రత్యేక పూజలు,అర్చనలు జరిపించి అమ్మవారి శేషవస్త్రాన్ని దాతలకు అందజేశారు.

గండి అంజన్నకు రూ.16,36 లక్షల ఆదాయం

చక్రాయపేట: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా రెండో శనివారం గండి వీరాంజనేయస్వామికి వివిధ రూపాల్లో రు.16,36,920లు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆలవల పాటి ముకుందరెడ్డి తెలిపారు.సేవా టికెట్ల రూపంలో రు,4,33,000, లడ్డూ ప్రసాద విక్రయాల ద్వారా రు.8,25,000, తాత్కాలిక హుండీల ద్వారా రు.1,67,800, శాశ్వత నిత్యాన్న దానానికి రు.2,11,120లు ఆదాయం వచ్చిందన్నారు. అలాగే మొదటి శనివారం వివిధ సేవా టికెట్ల రూపంలో రు.3,49,485,లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రు.5,68,500, తాత్కాలిక హుండీల ద్వారా రు.46,050 వచ్చిందన్నారు.

జలకళ..సాగు భళా

- రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం
- 866 మంది రైతుల పొలాల్లో ఉచిత బోర్లు
- రూ.3.72 కోట్లతో 303 బోర్ల డ్రిల్లింగ్





వేపులబైలు పంచాయతీలో డ్రిల్ చేస్తున్న వైఎస్సార్ జలకళ బోరు

పీలేరు రూరల్: భూగర్భంలో నీరున్నా.. బోర్లు వేయించి పాతాళ గంగను పైకి తెప్పించడం రైతులకు కత్తి మీద సామే. బోర్లు వేయించేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిందే. ఇది గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద రైతుల పొలాల్లో పంటలు సాగు చేసుకునేందుకు భూగర్భ జనవరులు పెంచి వారి జీవనోపాధి మెరుగుపరచాలని సంకల్పించింది. ఉచితంగా బోర్లు వేయించేందుకు వైఎస్సార్ జలకళ పథకం తీసుకొచ్చింది.

866 మంది పొలాల్లో ఉచిత బోర్లు

అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో వైఎస్సార్ జలకళ పథకం చిన్న, సన్న కారు రైతులకు వరంగా మారింది. ఐదెకరాల భూమి ఉన్న రైతులకు బోరు డ్రిల్లింగ్ చేయడంతోపాటు మోటారు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 866 మంది రైతులకు బోర్లు మంజూరయ్యాయి. 303 చోట్ల రూ.3.72 కోట్లు వెచ్చించి బోర్లు డ్రిల్ చేయించారు. 255 బోర్లలో పాతాళ గంగ పైకి ఉబికి వచ్చింది. దాదాపు పీలేరులో 13, రాయచోటికి 13 మోటార్లు బిగించారు.

ఒక బోరు విఫలమైతే మరో బోరు...

లబ్ధిదారుల పొలాల్లో బోరువేసేందుకు ముందుగా అనుమతినిస్తారు. డ్రిల్లింగ్ కాంట్రాక్టర్ అర్హతగల భూ విజ్ఞాన శాస్త్రవేత్తలతో సర్వే నిర్వహించి వివరాలను సంబంధిత అధికారికి సమర్పిస్తారు. బోరు వేయడం పూర్తయిన తర్వాత జియో ట్యాగింగ్‌తో కూడి డిజిటల్ ఛాయాచిత్రాన్ని లబ్ధిదారుడితో కలిసి అధికారులు తీసుకుంటారు. అనంతరం నిర్ణీత ధర ప్రకారం డ్రిల్లింగ్ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం సొమ్ము చెల్లిస్తుంది.

జిల్లాలో వైఎస్సార్ జలకళ కింద వేసిన బోర్ల వివరాలు

నియోజకవర్గం	మంజూరైన బోర్లు	డ్రిల్ చేసినవి	విజయవంతం అయినవి
పీలేరు	295	121	105
మదనపల్లె	35	04	03
తంబళ్లపల్లె	68	13	12
రాయచోటి	407	117	89
రాజంపేట	06	00	00
రైల్వే కోడూరు	55	48	46

పేద రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పేద రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తోంది. వైఎస్సార్ జలకళ పథకం సన్న, చిన్నకారు రైతులకు వరం. అర్హతగల ప్రతి రైతు పొలంలో ఉచితంగా బోర్లు వేయిస్తున్నారు. రైతులు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయిస్తాం. – చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే, పీలేరు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



వైఎస్సార్ జలకళ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రెండు పద్ధతుల్లో ఉచిత బోర్లు వేయడం జరుగుతోంది. ఐదెకరాల లోపు రైతుల పొలాల్లో బోరు వేయించడంతోపాటు మోటారు ఇవ్వడం జరుగుతోంది. – ఎం.సి.మద్దిలేటి, డ్వామా పీడీ, అన్నమయ్య జిల్లా

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



వైఎస్సార్ జలకళ పథకం తీసుకొచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. మా పొలాల్లో ఉచితంగా బోరు వేయించడం సంతోషంగా ఉంది. మా జీవితంలో వెలుగు నింపిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. – చెంగల్‌రాయుడు, వేపులబైలు, పీలేరు మండలం

అప్పుల బాధ లేదు



ప్రస్తుతం పొలాల్లో బోర్లు వేయించాలంటే లక్షల రూపాయల ఖర్చు అవుతుంది. అప్పుచేసి బోర్లు వేయలేక పొలాలను బీళ్లుగా పెట్టుకున్నాం. వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచితంగా బోరు వేశారు. ఈ పథకం ఉండడం మా అదృష్టం. – ఎ. నాగరాజ, పుట్టావాండ్లపల్లె, పీలేరు మండలం

29న కడపలో తెలుగు ప్రతిభా పోటీలు

కడప ఎడ్యుకేషన్: తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ జిల్లాశాఖ, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 29వ తేదీ ఉదయం 10 గంటలకు కడపలోని విద్యావనరుల కేంద్రంలో జిల్లాస్థాయి తెలుగు ప్రతిభా పోటీలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆర్‌యూపీపీ అధ్యక్షుడు ఎఫ్‌ఎంఎస్ ఖాదర్, గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి ఆదివారం తెలిపారు. ఇందుకు సంబంధించి 22వ తేదీన పాఠశాల స్థాయిలో పోటీలు జరిపి ఎంపికైన వారికి 24వ తేదీన మండల స్థాయి పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయస్థానాల్లో గెలుపొందిన వారికి 26వ తేదీన డివిజన్‌స్థాయిలో, ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి 29వ తేదీన జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేస్తామని తెలిపారు.

రేపు సిక్కీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

కడప కార్పొరేషన్: ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మానస ఇన్ హోటల్‌లో హెచ్‌పీ, భారత్ పెట్రోలియం , ఇండియన్ ఆయిల్ డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కో ఆర్డినేటర్లు సి. బాబు, రామక్రిష్ణలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సిక్కీ నేషనల్ ఛైర్మన్ ఏ. డేవిడ్ బెర్నార్డ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఓసీఎల్ ఎస్ఓ శ్రీనివాస్, బీపీసీఎల్ ఎస్ఓ ధనుష్, హెచ్‌పీసీఎల్ ఆర్ఎం నాగసతీష్, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, ఎస్‌బీఐ ఆర్ఎం నారాయణరావు, డీసీసీబీ సీఈఓ కె. రాజేంద్రకుమార్, పరిశ్రమల శాఖ జేడీ విజయలక్ష్మిలు పాల్గొంటారని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

సేవకు స్ఫూర్తి.. ఆకేపాటి

- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- ఆకేపాటి ఎస్టేట్‌లో ఉచిత కంటి పొర చికిత్స శిబిరం ప్రారంభం



జెడ్పీ చైర్మన్ ఆకేపాటితో కలిసి ఆపరేషన్ నిర్వహించే బస్సును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట రూరల్: ప్రజలకు సేవలందిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం శంకర నేత్రాలయం, వల్లూరు మాధవీలత-రమేష్‌రెడ్డి ఉచిత కంటిపొర చికిత్స శిబిరం నిర్వహించారు. ముందుగా శిబిరాన్ని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాయచోటి, రాజంపేట ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, ఆర్‌డీఓ రామకృష్ణారెడ్డిలతో కలిసి డిప్యూటీ సీఎం అంజద్ బాషా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆపరేషన్ నిర్వహించే శంకర నేత్రాలయ బస్సులను వారు ప్రారంభించారు. తర్వాత కంటి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కంటి పరీక్షలు ఖరీదైపోతున్న నేటి రోజులలో ఆకేపాటి ఉచితంగా వందల మందికి శస్త్రచికిత్సలు చేయించడం అభినందనీయమన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఆకేపాటికి ఎవరూ సాటి రారని అన్నారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కంటిచూపుతో ఒక జీవితంలో వెలుగు నింపవచ్చన్నారు. ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను ఏ విధంగా చేయాలో ఆకేపాటిని చూసి నేర్చుకోవాలని కోరారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ కంటి చూపు లేనివారు మన ఉమ్మడి జిల్లాల్లో ఉండకుండా చేసేందుకే విరివిగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 3వతేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, మిరియాల సురేఖ, ఐరగమరెడ్డి సుబ్బారెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య మాజీ గవర్నర్ రామలింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ విభాగాల కన్వీనర్లు, ఎంపీటీలు, సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా దాదాపు 100 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికయ్యారు.

ఘనంగా ఎంపీ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుక

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాయచోటి, రాజంపేట ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడాస్ఫూర్తితో యువత ముందుకెళ్లాలి



సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేత ఫలక్‌నుమా జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
- ముగిసిన సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్

మదనపల్లె : యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని ముందుకుసాగాలని, వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు. మదనపల్లె మండలం ఆరోగ్యవరం ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌లో వారంరోజులుగా జరుగుతున్న డాక్టర్.కేటీ.జెసూడియన్, జీపీ.అలెగ్జాండర్ మెమోరియల్ సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం తుదిదశకు చేరుకుంది. హోరాహోరీగా జరిగిన పోటీల్లో తెలంగాణకు చెందిన ఫలక్‌నుమా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైజాగ్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. వేలాదిమంది క్రీడాభిమానుల సమక్షంలో ఫైనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలను ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, సీఎస్ఐ డయాసిస్ బిషప్.రెవరెండ్.ఐజాక్.వరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్మన్ షమీంఅస్లాం, జెడ్పీటీసీ ఉదయ్ కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి తదితరులు తిలకించారు. ఆద్యంతరం ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఫలక్‌నుమా, వైజాగ్ జట్లు 1–1 స్కోరు సాధించడంతో పెనాల్టీ షూట్ అవుట్ పద్ధతిలో విజేత ఎంపిక నిర్వహించారు. ఇందులో హైదరాబాద్ ఫలక్‌నుమా జట్టు 4, వైజాగ్ టీమ్ 3 గోల్స్ సాధించడంతో ఫలక్‌నుమా జట్టు విజేతగా నిలిచింది. వైజాగ్ జట్టు రన్నర్ స్థానాన్ని కైవసం చేసుకుంది. చెన్నై టీమ్ మూడోస్థానంలో నిలిచింది. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, బిషప్.రెవరెండ్.వరప్రసాద్‌ల చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీలు, నగదుబహుమతిని, పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలను నిర్వహించడం యువతలో దాగి ఉన్న క్రీడాప్రతిభను ప్రదర్శించేందుకు వీలవుతుందన్నారు. ఫుట్‌బాల్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆరోగ్యవరం ఫుట్‌బాల్ లవర్స్, జీ.పి.అలెగ్జాండర్ ఫ్యామిలీ కుటుంబసభ్యులు, న్యాయీలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆరోగ్యవరం ఫుట్‌బాల్ లవర్స్ మదనపల్లె-తిరుపతి ఫోర్‌లేన్ ఏర్పాటులో భాగంగా ఫుట్‌బాల్ గ్రౌండ్ కొంతమేర కోల్పోతున్నామని, ప్రత్యామ్నాయంగా గ్రౌండ్‌కు ఆనుకుని వెనుకవేపున ఉన్న ప్రభుత్వస్థలాన్ని కేటాయించాల్సిదిగా బిషప్.వరప్రసాద్ తరపున వినతి చేశారు. దీనిపై ఎంపీ మిథున్‌రెడ్డి స్పందిస్తూ.. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిహారం ఇప్పించడంతో పాటుగా ప్రభుత్వస్థలం ఉంటే మంజూరుచేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కే.పి.రవీంద్ర, జేఎంసీ పాస్టర్ డాక్టర్.సునీల్‌వరకుమార్, వెలుగుచంద్ర, జబ్బలశ్రీనివాసులు, తట్టి శ్రీనివాసులురెడ్డి, కొమ్మేపల్లెశ్రీనివాసులురెడ్డి, గుండ్లూరురఫీ, సర్పంచ్ ఈశ్వరయ్య, పోతబోలునాగరాజ, మునిశేఖర్, పాల్‌చంద్రశేఖర్, సుగుణ, ఆంజనేయులు. ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, సర్పంచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'బహుమతుల ప్రదానం...

పోటీల్లో విన్నర్స్‌గా నిలిచిన హైదరాబాద్ ఫలక్‌నుమా జట్టుకు రూ.లక్ష, రన్నర్స్ వైజాగ్ శ్రీధర్‌క్లబ్‌కు రూ.50,000, మూడోస్థానంలో నిలిచిన చెన్నై టీమ్‌కు రూ.25,000 నగదును అందజేశారు. టోర్నమెంట్‌లో బెస్ట్ గోల్‌కీపర్‌గా డైనమోస్‌క్లబ్ తిరుపతి టీమ్ సభ్యుడు సూర్య, బెస్ట్ గోల్ స్కోరర్‌గా వైజాగ్ మహమ్మద్, బెస్ట్ ప్లేయర్‌గా హసన్(వైజాగ్ టీం కెప్టెన్) పురస్కారాలు అందుకున్నారు. మ్యాచ్ రెఫరీగా నాయుడుపేటకు చెందిన గౌస్, లైన్ అంపైర్లుగా జగదీష్, మారుతి వ్యవహరించారు. బీటీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ఫైనల్ పోటీలకు హాజరైన ముఖ్యఅతిథులకు గౌరవవందనం సమర్పించారు. జీపీ అలెగ్జాండర్ ఫ్యామిలీ, ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ ఏఓ జాకబ్‌ప్రశాంత్, అన్నమయ్య జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ మురళీ నగదు బహుమతులను అందించారు.

దీవెన..విద్యకు ఆలంబన

- నేడు జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల
- 31,743 మంది విద్యార్థులకు ప్రయోజనం
- తల్లుల ఖాతాలకు జమకానున్న రూ. 24.42 కోట్లు



జిల్లాలో నియోజకవర్గాల వారీగా విడుదల చేయనున్న నిధులు

నియోజకవర్గం	విద్యార్థులు	తల్లులు	జమకానున్న మొత్తం (రూ.కోట్లలో)
రైల్వేకోడూరు	5,041	4,639	3.70
మదనపల్లి	6,364	5,871	4.60
పీలేరు	6,197	5,597	4.09
రాజంపేట	4782	4,387	3.56
రాయచోటి	6783	6273	4.89
తంబళ్లపల్లె	5,401	4,976	3.55

సాక్షి రాయచోటి : అందరూ చదవాలి...అందరూ ఎదగాలి అన్న నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పలు మార్పులు తీసుకొస్తుంది. దీనికి తోడు పేద విద్యార్థులకు చేయూత నివ్వడానికి పలు పథకాలు అమలు చేస్తోంది. సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించి కోవిడ్ కల్లోలంలోనూ దాన్ని తూచా తప్పకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు చదివించాలన్న లక్ష్యంతో రూపకల్పన చేసిన పథకం జగనన్న విద్యా దీవెన. పేద విద్యార్థులకు చదువుతోపాటు హాస్టల్‌కు అయ్యే ఖర్చులను జగన్‌సర్కార్ భరిస్తూ విద్యార్థుల్లో చదువుల భరోసా కల్పిస్తోంది. జగనన్న విద్యా దీవెనకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేడు చిత్తూరు జిల్లా నగరి బహిరంగ వేదిక నుంచి జగనన్న విద్యా దీవెన (ఏప్రిల్ -మే- జూన్ 2023) త్రైమాసికం సంబంధించి సొమ్మును విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

పేదల చదువుకు భరోసా

నిరుపేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి సకాలంలో, బకాయిలు లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారు. ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికమే ఆ పిల్లల తల్లులకే చెల్లించి, వారే కాలేజీలకు ఫీజులు కట్టేలా చేసి పేదల ఇంట విద్యా జ్యోతులు వెలిగిస్తున్నారు. జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది. అన్నమయ్య జిల్లాలో జగనన్న విద్యా దీవెన పథకం త్రైమాసికం సంబంధించి 34,568 మంది విద్యార్థులకు గాను అర్హులైన 31,743 మంది తల్లుల ఖాతాలలో రూ.24.42 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయనున్నడంతో పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



పేద విద్యార్థులకు ఉన్నత చదువులు చదివించాలన్న లక్ష్యంతో రూపకల్పన చేసిన పథకం ద్వారా అందిస్తున్న సొమ్ములను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం చదువులతోపాటు హాస్టళ్లలో ఫీజులను కూడా చెల్లిస్తూ వస్తోంది. ఎప్పటికప్పుడు త్రైమాసికంలో విడుదల చేస్తూ అండగా నిలుస్తోంది. సోమవారం చిత్తూరు జిల్లా నగిరి బహిరంగ వేదిక నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఎకౌంట్లలో డబ్బులు జమ చేయనున్నారు. – పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్

ఫొటోగ్రఫీలో ప్రతిభ

ఏఎఫ్‌యూ: ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో జూన్ నెలలో నిర్వహించిన జాతీయస్థాయి త్రైమాసిక ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో కడపలోని డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ ఫొటోగ్రఫీ విద్యార్థి జి. విల్సన్ ప్రతిభ కనబరిచాడు. ఈ కాంపిటీషన్‌లో ఫెస్టివల్ థీమ్ మోనోక్రోమ్ విభాగంలో ఈయన తీసిన చాయాచిత్రం భండారా ఫెస్టివల్ (జెజూరి యాత్ర, మహారాష్ట్ర)కు రెండో ఉత్తమ బహుమతి లభించింది. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 77 సంవత్సరాలు అయిన సందర్భంగా జాతీయ ఫొటో కాంపిటీషన్ -2023లో భాగంగా నిర్వహించిన ఈ కాంపిటీషన్‌లో ఈయన తీసిన చిత్రానికి రెండో బహుమతి లభించింది. విద్యార్థికి వీసీ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

కారు, బైక్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన మహ్మద్ గౌస్

పుల్లంపేట : మండల పరిధిలోని రామక్కపల్లి సమీపాన కడప–చెన్నై జాతీయ రహదారిపై శనివారం రాత్రి కారు, బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజంపేటలోని ముకుందార్ గడ్డకు చెందిన మహ్మద్ గౌస్, మహేష్, కిరణ్ అనే ముగ్గురు వ్యక్తులు కోడూరుకు ద్విచక్రవాహనంలో రాజంపేట నుంచి బయలుదేరారు. రామక్కపల్లి సమీపానికి రాగానే తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మహ్మద్ గౌస్(45) మృతి చెందాడు. మహేష్, కిరణ్‌లకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పుల్లంపేట ఎస్ఐ రఘురాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి..

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట చెరువు కట్టపై ఆదివారం బైక్ అదుపుతప్పి కింద పడటంతో రాచపల్లెకు చెందిన రజాక్(19) అనే యువకుడు గాయపడ్డాడు. ఇంటి నుంచి వ్యక్తిగత పని మీద ఒంటిమిట్టకు వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. బాధితుడిని స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

పాము కాటుతో..

చిన్నమండెం : పాము కాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దిగువగొట్టివీడు గ్రామానికి చెందిన మార్కాపురం మమత(32) శనివారం రాత్రి నిద్రపోతుండగా.. దుప్పట్లోకి పాము దూరింది. ఈ క్రమంలో పాము కాటుకు గురైన ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి బంధువులు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రగ్స్ మాఫియా కదలికల కలకలం

- ముంబై పోలీసుల దాడులతో బయటపడిన వైనం
- టీడీపీ నేత ఫామ్ హౌస్‌లో మకాం వేసిన నిందితుడు

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో ముంబైకి చెందిన డ్రగ్స్ మాఫియా కదలికలు కలకలం రేపుతున్నాయి. కొన్ని రోజులుగా ముంబైకి చెందిన వ్యక్తి రాయచోటి ప్రాంతంలోనే తిరుగుతూ తన డ్రగ్స్ వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. నాలుగు రోజుల కిందట ముంబై పోలీసులు డ్రగ్స్ మాఫియా నిందితుల కోసం రాయచోటి పోలీసులను ఆశ్రయించారు. అతని సెల్ నెట్‌వర్క్ ఆధారంగా రాయచోటి–రాజంపేట సరిహద్దులో టీడీపీ నేతకు చెందిన ఫామ్ హౌస్‌లో ఉన్నట్లు సమాచారం అందింది. రాయచోటి పోలీసుల సాయంతో ముంబై పోలీసులు కలిసి ఒక్కమారుగా ఫామ్ హౌస్‌పై దాడి చేశారు. ఫామ్ హౌస్‌లో గుట్టు చప్పుడు కాకుండా సేద తీరుతున్న డ్రగ్స్ మాఫియా నిందితుడిని అదుపులోకి తీసుకోవడం.. ఒక్కమారుగా అన్నమయ్య జిల్లాలో అలజడి రేకెత్తించింది. ఈ సంఘటన జరిగి వారం రోజులు కావస్తున్నా డ్రగ్స్ మాఫియా నిందితులపై జరుగుతున్న ప్రచారం ఆగడం లేదు.



ముంబై డ్రగ్స్ మాఫియా నిందితుడు

కారణం పట్టుబడిన ప్రాంతంలో కొంత డ్రగ్స్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకోవడం ఒక ఎత్తయితే.. పట్టుబడిన ఫామ్ హౌస్ యజమానిపై అనేక అవినీతి ఆరోపణలు వినిపిస్తుండడం మరో కారణం. నిందితునితోపాటు అతని భార్య, పిల్లలను కూడా ముంబై పోలీసులు వెంట తీసుకెళ్లినట్లు తెలియవచ్చింది.

దశాబ్ద కాలం క్రిందట రాయచోటి ప్రాంతంలోని ప్రైవేటు లాడ్జీలో డ్రగ్స్ మాఫియాకు చెందిన ముగ్గురు సభ్యులను రాయచోటి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కిలో వరకు మాదకద్రవ్య పదార్థాలను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచిన విషయం తెలిసిందే. అయితే నిన్నటి వరకు మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్, ఎర్రచందనం అక్రమ రవాణా మాఫియా నేరగాళ్లు కనిపించే అన్నమయ్య జిల్లాలో.. డ్రగ్స్ మాఫియా నిందితుని గట్టురట్టు కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముంబై ప్రాంతానికి చెందిన డ్రగ్స్ మాఫియా నిందితుడికి ఆశ్రయం కల్పించిన ఫామ్ హౌస్ యజమాని రాయచోటిలో టీడీపీ నేతగా చలామణి అవుతూ రియల్ ఎస్టేట్, జీరో బంగారు వ్యాపారంతో కోట్ల రూపాయలకు పడగలెత్తిన వ్యక్తిగా పేరుంది. ఇతను టీడీపీలోని ఒక వర్గానికి చెందిన కీలకమైన వ్యక్తిగా పోలీసుల సమాచారం. నిందితునితో టీడీపీ నేతకున్న సంబంధాలు, వ్యాపార లావాదేవీలపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలియవచ్చింది.



ముంబై డ్రగ్స్ మాఫియా నిందితుడు ఆశ్రయం పొందిన టీడీపీ నేత ఫామ్‌హౌస్

లోతైన అన్వేషణ చేస్తున్నాం: డీఎస్పీ

రాయచోటి పట్టణ సమీపంలో పట్టుబడిన ముంబై డ్రగ్స్ మాఫియా నిందితుడితో ఈ ప్రాంత వాసులకు ఉన్న సంబంధాలపై లోతైన అన్వేషణ చేస్తున్నామని రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా చెప్పారు. ముంబై పోలీసుల సమాచారం మేరకు సెల్‌ఫోన్ నెట్‌వర్కు ఆధారంగా ఫామ్‌హౌస్‌లో ఉన్నట్లు గుర్తించామన్నారు. గత కొన్ని రోజులుగా రాయచోటిలోని ఓ ప్రైవేటు లాడ్జీలో కూడా బస చేసినట్లు సమాచారం ఉందన్నారు. ముంబై డ్రగ్స్ మాఫియాతో ఈ ప్రాంత వాసులకు ఎలాంటి సంబంధాలు ఉన్నాయన్న విషయంపై త్వరలోనే తేలుస్తామన్నారు. ఇప్పటికే మాఫియా వ్యక్తులతో రాయచోటి ప్రాంతంలో ఎలాంటి వ్యాపారాలు జరుగుతున్నాయన్న విషయాన్ని ముంబై పోలీసులను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. పట్టుబడిన నిందితుని సెల్‌ఫోన్ ఆధారంగా మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు. ఈ మాఫియాలో ఎవరి పాత్ర ఉన్నా వారిని వదిలిపెట్టబోమని డీఎస్పీ తెలిపారు.

ఖైదీకి అవార్డు, ప్రశంసాపత్రం

కడప అర్బన్ : హత్య కేసులో 24 ఏళ్లపాటు జీవిత ఖైదు అనుభవిస్తున్న టి.శ్రీకాంత్ గౌడ్‌కు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సీతారామన్ అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. తిరుపతి జిల్లా గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గౌడ్ 24 ఏళ్ల కిందట ఓ హత్య కేసులో కడప కేంద్రకారాగారానికి జీవిత ఖైదుగా వచ్చాడు. రాజమండ్రి జైల్లో వున్నప్పుడు అంబేడ్కర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీ పూర్తి చేశారు. కడప కేంద్ర కారాగారానికి వచ్చాక ఎం.ఏ సోసియాలజీ పూర్తి చేశారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా.. నాలుగు నెలల క్రితం రాష్ట్రంలోని అన్ని జైళ్లలో వున్న ఖైదీలకు 'డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విత్ మై లైఫ్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కడప కేంద్ర కారాగారంలో నిర్వహించిన పోటీల్లో శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జైళ్లలో వున్న 44 మంది ఖైదీలు పోటీల్లో పాల్గొన్నారు. శ్రీకాంత్ గౌడ్ రాసిన వ్యాసానికి స్పెషల్ కేటగిరిలో మొదటి బహుమతి వచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ సీతారామన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రంతోపాటు జ్ఞాపికను అందజేశారు. ప్రస్తుతం శ్రీకాంత్ గౌడ్ నెల్లూరు జిల్లాలో కేంద్ర కారాగారంలో వున్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

వాల్మీకిపురం : చోరీ కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 369 గ్రాముల బంగారు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ మేకలవారిపల్లిలో నివాసం ఉంటున్న మేకల గుర్రప్ప (60) వివిధ దొంగతనాల కేసుల్లో పాత నేరస్తుడు. ఇతను తన ఇద్దరు కుమారులు మేకల హరివేంద్ర (22), మేకల దేవేంద్ర (25)తో కలసి కలికిరి, వాల్మీకిపురం మండలాల్లో ఇంటి యజమానులు ఊరికి వెళ్లే సమయాలను, ఇంటికి తాళాలు వేసిన ఘటనలు గుర్తించి చోరీలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో కలికిరి పట్టణంలోని అమరనాథరెడ్డి కాలనీలో ఈ ఏడాది జూలై 29న అర్ధరాత్రి సమయంలో విశ్రాంత రైల్వే ఉద్యోగిని కావాలి రాజమ్మ ఇంట్లో చోరీకి పాల్పడి నగలను దోచుకెళ్లారు. అలాగే గతేడాది డిసెంబరు 21వ తేదీ అర్ధరాత్రి సమయంలో వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామం బజారువీధికి చెందిన పువ్వాడ వెంకటరమణయ్యశెట్టి ఇంట్లో బంగారు నగలను దోచుకెళ్లారు. శనివారం సాయంత్రం విఠలం సమీపంలో ఆ ముగ్గురి నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.9.27 లక్షల విలువ చేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ సమక్షంలో ఆదివారం నిందితులను అరెస్ట్ చూపి రిమాండ్‌కు తరలించారు. చోరీ కేసులను ఛేదించిన సీఐ సురేష్ కుమార్, కలికిరి ఎస్ఐ రహీముల్లాను డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో పోలీసులు మధుసూదనాచారి, రవిశేఖర్, దస్తగిరి, సతీష్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, ఎస్ఐ

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు ప్రయత్నించి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన కె.అంజప్ప(29) కుటుంబ సమస్యలతో ఆదివారం ఇంటి వద్ద గన్నేరుపప్పు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడ్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా మదనపల్లె మండలం కోటవారిపల్లెకు చెందిన రజనీకాంత్ భార్య వాణిశ్రీ(25) కుటుంబ సమస్యలతో ఇంటి వద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పీటీఎం మండలం రంగసముద్రం గ్రామానికి చెందిన శ్రీకాంత్(38) కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సల అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ కేసులను సంబంధింత పోలీసులు విచారణ చేస్తున్నారు.

వ్యక్తిని గొంతు కోసి హత్య



హత్యకు గురైన కృష్ణారెడ్డి

చిట్వేలి : మండల పరిధిలోని కేఎస్ అగ్రహారంలో బిక్కిరెడ్డి మునికృష్ణారెడ్డి(42)ని ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేశారు. గ్రామంలో వివాద రహితుడిగా, మంచి వ్యక్తిగా పేరున్న కృష్ణారెడ్డిని స్థానిక ఈశ్వరీదేవి ఆశ్రమం (రంగయ్యస్వామి మఠం) సమీపంలో హత్య చేసి పడేశారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో వ్యక్తి పడిపోయి ఉండటాన్ని గుర్తించిన కొందరు దగ్గరకు వెళ్లి చూడగా.. కృష్ణారెడ్డి అని నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ మధుసూదన్‌రెడ్డి, ఓబులవారిపల్లె ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, చిట్వేలి ఏఎస్ఐ వెంగయ్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు పరిశీలించాయి. రక్త నమూనాలను సేకరించినట్లు పోలీసులు తెలిపారు. కృష్ణారెడ్డికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ హత్య అటు గ్రామస్తులకు, ఇటు పోలీసులకు మిస్టరీగా మిగిలిపోయింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ మధుసూదన్‌రెడ్డి

తాళం వేసిన ఇంటికి కన్నం

రామాపురం : మండలంలోని కుమ్మరపల్లికి చెందిన మోతపూరి జయరాం ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జయరాం కుమార్తె విజయవాడలో చదువుతోంది. దీంతో శనివారం జయరాంతోపాటు ఆయన భార్య విజయవాడకు బయలుదేరారు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న గుర్తుతెలియని వ్యక్తులు డోర్ లాక్ తీసి లోపలికి వెళ్లారు. బీరువా, టీవీలను బయటికి తీసుకొచ్చి ధ్వంసం చేశారు. బీరువాలో బంగారు నగలు, సుమారు రూ.3 లక్షల నగదు ఉంటాయని బాధితులు తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు.



బయట పడవేసిన బీరువా

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

బద్వేలు అర్బన్ : బద్వేలు – కడప రహదారిలోని గొడుగునూరు క్రాస్ రోడ్డు వద్ద శనివారం రాత్రి బైక్ అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. పట్టణంలోని ఆంజనేయనగర్‌లో నివసించే చెంచిరెడ్డి, ఈశ్వరమ్మల కుమారుడైన మాచుపల్లి మనోహర్ రెడ్డి (29) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. శనివారం రాత్రి అట్లూరు మండలం కొండూరుకు ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో.. అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు.

పూచి పడిన డబ్బు ఎలా తీర్చాలి!

ఆందోళనతో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : బ్యాంక్‌లో పూచి పడిన డబ్బు ఎలా తీర్చాలనే ఆందోళనతో ఓ సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జమ్మలమడుగు పట్టణంలోని బెల్లాలవారి వీధిలో చోటు చేసుకొంది. బద్వేలు నియోజకవర్గంలోని రెడ్డిపల్లె గ్రామానికి చెందిన జంగిటి వినోద్‌కుమార్(27) కొంత కాలం నుంచి పెద్దముడియం మండలంలోని కొండసుంకేసుల గ్రామం సచివాలయంలో సహాయ వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కొంత కాలం క్రితం మైలవరం మండలం కర్మలవారిపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి బ్యాంక్‌లో పూచి పడి రూ.10 లక్షలు ఇప్పించాడు. తీసుకున్న వ్యక్తి చెల్లించలేదు. దీంతో బ్యాంక్ అధికారులు వినోద్‌కుమార్ జీతం నుంచి తీసుకోవడం జరుగుతోంది. ఇలా ఎన్ని నెలలు చెల్లించాలని ఆందోళన చెందాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య సౌజన్య గమనించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

సంఘమిత్రల చేతివాటంలో సీసీలకూ వాటా?

- మండలంలో రూ.కోటికి పైగానే స్వాహా
- సమగ్ర విచారణ చేపడితే వెలుగులోకి..

పెద్దతిప్పసముద్రం : తంబళ్లపల్లి నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం మండలంలో పని చేస్తున్న సంఘమిత్రలు.. గ్రూపు సభ్యుల నుంచి చేతివాటం ప్రదర్శించిన సొమ్ము నుంచి సీసీలకూ వాటాలిచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. గత కొన్ని రోజుల క్రితం స్త్రీ నిధి, కమ్యూనిటీ ఇన్‌వెస్ట్‌మెంట్ ఫండ్ (సీఐఎఫ్) సొమ్ము మాయాజాలం వ్యవహారంపై నాలుగు ప్రత్యేక బృందాలు.. నాలుగు గ్రామ సమాఖ్యల పరిధిలో ఉన్న మహిళా సంఘాల గ్రూపు రికార్డులను పరిశీలించి ఆడిట్ నిర్వహించాయి. ఇందులో రూ.20.31 లక్షల సొమ్ము స్వాహా అయినట్లు బట్టబయలైంది. ఈ విషయం సాక్షి పత్రికలో ప్రచురితం కావడంతో.. మిగిలిన గ్రామ సమాఖ్యల పరిధిలో ఉన్న గ్రూపు సభ్యుల్లో కూడా పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. దీంతో మిగిలిన సంఘమిత్రల గుండెల్లో గుబులు పట్టుకుంది. డీఆర్‌డీఏ జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక బృంద సభ్యులతో మండలమంతా సమగ్రంగా ఆడిట్ నిర్వహిస్తే.. రూ.కోటికి పైగా స్వాహా సొమ్ము వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.



పెద్దతిప్పసముద్రం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం

మిగిలిన వీవోల్లోనూ ఆందోళన

ఇన్నాళ్లు గడువు ముగిసినా స్త్రీ నిధి, సీఐఎఫ్ రుణాల రికవరీలో సంఘమిత్రలు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. రుణాలు పొందిన సభ్యుల నుంచి వసూలు చేసిన నెలవారి కంతుల సొమ్మును బ్యాంకులకు జమ చేయకుండా ఉన్న వారు.. ఆడిట్‌తో ఒక్కసారిగా ఉలిక్కిపడి గుట్టుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. ఆడిట్ కారణంగా మిగిలిన వీవోల్లోని సంఘమిత్రలు సైతం ఆందోళన చెందుతూ నగదును బ్యాంకుకు జమ చేసే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. పలు చోట్ల సంఘమిత్రలు వారికి అనుకూలంగా ఉన్న గ్రూపు సభ్యుల నుంచి వేలి ముద్రలు తీసుకుని స్త్రీ నిధి ద్వారా నగదు పొంది ప్రైవేటు వ్యక్తులకు అధిక వడ్డీలకు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది.

34 గ్రామ సమాఖ్యలు.. 37 మంది సంఘమిత్రలు

మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో 1,205 మహిళా సంఘాలు ఉన్నాయి. ఈ గ్రూపుల్లో 12 వేల మందికి పైగా మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈ సంఘాలన్నీ 34 గ్రామ సమాఖ్యల (వీవో)ల పరిధిలో ఉన్నాయి. 37 మంది సంఘమిత్రల పర్యవేక్షణలో ఈ సంఘాలు నిర్వహిస్తున్నారు.

గ్రూపు సభ్యుల నుంచి వసూళ్లు

ఒక గ్రూపులోని సభ్యులను ఆధారంగా చేసుకుని రూ.5 నుంచి రూ.15 లక్షల వరకు బ్యాంకు నుంచి రుణం మంజూరు చేస్తారు. అయితే రుణం డబ్బులు మహిళల చేతికి అందగానే ఒక గ్రూపులోని ఒక్కో సభ్యురాలి నుంచి రూ.వెయ్యి నుంచి రూ.2 వేల దాకా సంఘమిత్రలు బలవంతంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాము మీ నుంచి తీసుకున్న సొమ్ములో సీసీలకూ వాటాలివ్వాలని సంఘమిత్రలు గ్రూపు సభ్యులకు చెబుతున్నారు. మీకెందుకు ఇవ్వాలని సభ్యులు ప్రశ్నిస్తే.. మీకు ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే ఎలాంటి రాయితీ సొమ్ము మీకు, మీ గ్రూపులకు జమ కావని సంఘమిత్రలు తెగేసి చెబుతున్నారని పలువురు సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆడిట్ జరగకుండా యత్నాలు

నాలుగు గ్రామ సమాఖ్యల ఆడిట్‌తో మిగిలిన సంఘమిత్రల్లో ఆందోళన మొదలైంది. తాము సంఘమిత్రలుగా విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆడిట్ జరిగితే అసలు బండారం బట్టబయలు అవుతుందని భావించిన సంఘమిత్రలు.. ఏదో విధంగా సీసీలకు, వారికి అనుకూలంగా ఉండే ఉన్నతాధికారులకు నగదు రూపంలో దక్షిణ సమర్పించి మిగిలిన వీవో పరిధిల్లో ఆడిట్ జరగకుండా ఉండేందుకు పావులు కదుపుతున్నారు.

మూఢనమ్మకాలను పారదోలడమే లక్ష్యం

రాయచోటి అర్బన్ : ప్రజల్లోని మూఢనమ్మకాలను పారదోలడమే జనవిజ్ఞానవేదిక లక్ష్యమని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రాహుల్, కంటి వైద్యుడు రెడ్డెన్న అన్నారు. పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్‌లో ఆదివారం జేవీవీ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు జేవీవీ కృషి చేస్తోందన్నారు. జేవీవీ కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలకు మరింతగా విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పర్యావరణం, విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అనంతరం ఉమర్ బాషా, నాగేశ్వరరావు మ్యాజిక్‌షో, మిమిక్రీ కార్యక్రమాలను నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారానికి ఎంపికైన జేవీవీ రాయచోటి మండల అధ్యక్షుడు ఆంజనేయులును సన్మానించారు. తొలుత జేవీవీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు హరినాథరెడ్డి, చాన్‌బాషా, జేవీవీ సభ్యులు వై.సి.రెడ్డెప్పరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, రామయ్య, కళావతి, వినయ్ కుమార్, ప్రతాప్‌రెడ్డి, శంకరయ్య, సురేంద్రరాజు, రవి, రాజశేఖర్, మధుసూదన్, శ్రీనివాసులు, అసదుల్లాతోపాటు పలువురు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



జేవీవీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

బాలిక అదృశ్యం

ములకలచెరువు : మండలానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువుకు చెందిన పటాన్ కుమార్తె (17) ఇంటి పనుల మీద బయటకు వెళ్లింది. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులను విచారణ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన జనార్ధన్

రామాపురం : మండలంలోని కల్పనాయునిచెరువు పంచాయతీ గాలంగుండ్లపల్లె దళితవాడకు చెందిన సిరిపురి జనార్ధన్(42) అనారోగ్యంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కొండారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సంబేపల్లె మండలం గుదియాండ్లపల్లెకు చెందిన జనార్ధన్ కొన్నేళ్ల క్రితం రామాపురం మండలం గాలంగుండ్లపల్లె దళితవాడలో వివాహం చేసుకున్నాడు. తాను అత్తగారింటి ఊర్లోనే నివాసం ఉంటున్నారు. నాలుగేళ్లుగా గుండె జబ్బుతో తీవ్రంగా ఇబ్బంది పడుతుండటంతో.. కుటుంబ పోషణ భారంగా మారింది. అలాగే మనస్పర్థలతో ఈ నెల 25న ఇంటి వద్ద ఉరి వేసుకున్నాడు. వెంటనే ఆయన భార్య పార్వతి కిందికి దించి చికిత్స నిమిత్తం 108లో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని గర్భిణి దుర్మరణం

పెండ్లిమర్రి : మండలంలోని బుద్ధాయపల్లె గ్రామ సమీపంలో ఆదివారం ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో గర్భిణి దుర్మరణం చెందింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... బుద్ధాయపల్లె గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, సొల్లు గంగాదేవి(25), కుమార్తె సుశి కలిసి ద్విచక్ర వాహనంలో వైద్యం కోసం కడప ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలో ట్రాక్టర్ డ్రైవర్ అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనంలో వెళుతున్న వారు కింద పడ్డారు. గంగాదేవి తలపై ట్రాక్టర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుబ్బరాయుడు, కుమార్తె సుశికి గాయాలు అయ్యాయి. వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.



గంగాదేవి మృతదేహం వద్ద రోదిస్తున్న సంబంధీకులు